


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4 PM
www.suryaa.com

సోమవారం
01 ఏప్రిల్ 2024
పేజీలు: 02

## ఏప్రిల్ 5న కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ఏప్రిల్ 5న విడుదల చేయనుంది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... మార్చి 16న తమ పార్టీ 5 న్యాయాలు, 25 గ్యారెంటీలను(పాంచ్ న్యాయ్, పచ్చీస్ గ్యారెంటీస్) విడుదల చేసిందన్నారు. ఇంటింటికీ గ్యారెంటీ పేరిట ఏప్రిల్ 3 నుంచి 8 కోట్ల గ్యారెంటీ కార్డులను దేశ వ్యాప్తంగా పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ఏప్రిల్ 5న మేనిఫెస్టో విడుదల చేస్తామన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజలతో సంప్రదించి, అలాగే ఈ మెయిల్ ద్వారా, 'ఆవాజ్ భారత్ కి' వెబ్‌సైట్ ద్వారా అందిన వేలాది సూచనలను క్రోడీకరించి కాంగ్రెస్ మేనిఫెస్టోని రూపొందించినట్లు జైరాం రమేష్ చెప్పారు. ప్రజల మనోభావాలకు తమ మేనిఫెస్టో ప్రతిబింబం అని స్పష్టం చేశారు.

## వినియోగదారులకు గుడ్‌న్యూస్.. తగ్గిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర




ధరల మోతతో ఇబ్బంది పడుతున్న గ్యాస్ వినియోగదారులకు దేశీయ చమురు సంస్థలు ఉపశమనం కలిగించాయి. వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ ధరను తగ్గించాయి. 19 కేజీల సిలిండర్‌పై రూ.30.50 మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. తగ్గిన ధరలు ముంబై, కోల్‌కతా, చెన్నై సహా దేశవ్యాప్తంగా నేటి నుంచి అంటే ఏప్రిల్ 1వ తేదీ నుంచే అమల్లోకి వస్తాయని వెల్లడించాయి. చమురు సంస్థల నిర్ణయంతో దేశ రాజధాని ఢిల్లీలో రూ. 1,795గా ఉన్న వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ. 1,764.50కి తగ్గింది. అదేవిధంగా ముంబైలో రూ.1,749 నుంచి రూ.1,717.50కి తగ్గింది. చెన్నైలో మాత్రం 19 కేజీల సిలిండర్‌పై రూ.30 తగ్గించారు. దీంతో ప్రస్తుత ధర రూ.1,960.50 నుంచి రూ.1,930కు సిలిండర్ ధర తగ్గింది. అదేవిధంగా కోల్‌కతాలో రూ.1,911 ఉన్న కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,879కి తగ్గింది. స్థానిక పన్నుల ఆధారంగా రాష్ట్రాలను బట్టి ధరల్లో మార్పులు ఉంటాయి.




# లిక్కర్ కేసులో తీహార్ జైలుకు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

## 15 రోజులు జ్యుడీషియల్ రిమాండ్

మద్యం పాలసీ కేసులో ఈడీ కస్టడీలో ఉన్న ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. లిక్కర్‌స్కామ్‌లో 15 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ సోమవారం ఉదయం తీర్పు వెలువరించింది.ఈ కేసులో మార్చి 22న కేజ్రీవాల్‌ను అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. రౌస్ అవెన్యూ కోర్టు ఆయనకు వారం రోజుల పాటు ఈడీ కస్టడీకి అప్పగించింది. ఆ గడువు మార్చి 28న ముగియడంతో కోర్టులో హాజరుపరుచగా ఢిల్లీ సీఎంకు మరో మూడు రోజులు కస్టడీ విధించింది. కోర్టు విధించి ఈడీ కస్టడీ నేటితో ముగిసింది. దీంతో అధికారులు ఆయన్ని ఇవాళ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. భారీ భద్రత మధ్య ఆయన్ను కోర్టుకు తీసుకువచ్చారు. స్పెషల్ జడ్జి కావేరి బవేజా ముందు ఆయన్ను ప్రొడ్యూస్ చేశారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్‌కు కోర్టు రిమాండ్ విధించింది. ఏప్రిల్ 15 వరకూ జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ తీర్పు వెలువరించింది. ఢిల్లీ సీఎంను తీహార్ జైలుకు పంపాలని ఆదేశించింది. కోర్టుకు తీసుకువస్తున్న సమయంలో రిపోర్టర్లు కేజ్రీని ప్రశ్నించారు. ప్రధాని మోదీ చేస్తోంది దేశానికి మంచిది కాదు అని కేజ్రీవాల్ ఈ సందర్భంగా అన్నారు. అయితే, తనను అక్రమంగా అరెస్ట్ చేశారంటూ ఇప్పటికే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కేజ్రీవాల్ పిటిషన్ మంగళవారం విచారణకు రానుంది.

### ప్రధాని చేస్తోంది దేశానికి మంచిదికాదన్న ఢిల్లీ సీఎం

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఇవాళ రౌజ్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. భారీ భద్రత మధ్య ఆయన్ను కోర్టుకు తీసుకువచ్చారు. స్పెషల్ జడ్జి కావేరి బవేజా ముందు ఆయన్ను ప్రొడ్యూస్ చేశారు. మద్యం పాలసీ స్కామ్‌లో ప్రస్తుతం కేజ్రీవాల్ ఈడీ కస్టడీలో ఉన్నారు. కోర్టుకు తీసుకువస్తున్న సమయంలో రిపోర్టర్లు కేజ్రీని ప్రశ్నించారు. ప్రధాని మోదీ చేస్తోంది దేశానికి మంచిది కాదు అని కేజ్రీవాల్ అన్నారు. కేజ్రీని జుడిషియల్ కస్టడీకి అప్పగించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోర్టులో దాఖలు చేసుకున్నది. ఈడీ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదిస్తున్నారు. ఈడీ కస్టడీ ముగియడంతో కేజ్రీవాల్‌ను జ్యుడీషియల్ కస్టడీకి పంపాలని ఈడీ కోర్టును కోరింది. అంతేకాదు లిక్కర్ పాలసీ, మనీ లాండరింగ్ కేసు దర్యాప్తుకు కేజ్రీవాల్ సహకరించడం లేదని చెప్పింది. తప్పించుకునే సమాధానలు ఇస్తున్నారని వెల్లడించింది. కేజ్రీవాల్ డిజిటల్ పరికరాల పాస్ వర్డ్స్ ఇవ్వ లేదని, తెలీదు అన్న సమాధానాలు మాత్రమే ఇచ్చారని ఈడీ చెప్పింది. ఈడీ వాదనను పరిగణనలోకి తీసుకున్న కోర్టు కేజ్రీవాల్‌కు ఏప్రిల్ 15 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది.



## నేడు జ్ఞానవాపీపై సుప్రీంలో విచారణ

యూపీలోని జ్ఞానవాపీ మసీదు ప్రాంగణంలో పూజలకు ఇచ్చిన అనుమతిని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను ఈరోజు సుప్రీం కోర్టు విచారించనుంది. మసీదులో హిందువులు పూజలు చేసుకోవడానికి అనుమతిస్తూ దిగువకోర్టు ఇచ్చిన తీర్పును ఫిబ్రవరి 26న అలహాబాద్ హైకోర్టు సమర్థించిన విషయం తెలిసిందే. కాగా ఈ తీర్పును సవాల్ చేస్తూ జ్ఞానవాపీ మసీదు కమిటీ సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది.



## నిజాంసాగర్ కెనాల్‌కు గండి.. ఇళ్లలోకి నీరు

ఆర్మూర్‌లో నిజాంసాగర్ కెనాల్‌కు గండి పడింది. ఆర్మూర్ పట్టణ కేంద్రంలోని జర్నలిస్ట్ కాలనీకి ఆనుకొని ఉన్న నిజాంసాగర్ కెనాల్ కట్టకు ఓ చోట గండి పడింది. దీంతో కాలనీలోని ఇండ్లలోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. సోమవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకోవడంతో గ్రామస్తులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ఇండ్లు పూర్తిగా వరద నీటితో మునిగిపోవటంతో..చాలా మంది నిరాశ్రయులయ్యారు. ఇరిగేషన్ కెనాల్ అధికారుల నిర్లక్ష్యమే కారణంగానే ఈ ఘటన జరిగింది అంటూ స్థానికుల ఆరోపణ చేస్తున్నారు. త్వరగా సహాయక చర్యలు మొదలు పెట్టాలని కాలనీ వాసుల డిమాండ్ చేస్తున్నారు.

## నేటి నుంచి పెరగనున్న పెయిన్ కిల్లర్స్ ధరలు


సామాన్యులకు భారీ షాక్ తగలనుంది. నేటి నుంచి పెయిన్ కిల్లర్లు, యాంటీబయోటిక్స్, యాంటీ ఇన్‌ఫెక్టివ్ వంటి అత్యవసరమైన మందుల ధరలు పెరగనున్నాయి. నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) ఔషధాల టోకు ధర సూచికలో వార్షిక సవరణ చేసింది. దీంతో నేషనల్ లిస్ట్ ఆఫ్ ఎసెన్షియల్ మెడిసిన్స్ (ఎన్ఎల్ఈఎం) జాబితాలో ఉన్న మందులపై 0.0055 శాతం ధరలు పెరగనున్నాయి.

## ఢిల్లీ క్యాపిటల్స్ బోణీ




ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఎట్టకేలకు బోణీ చేసింది. డేవిడ్ వార్నర్ (35 బాల్స్‌లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 52), రిషబ్ పంత్ (32 బాల్స్‌లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 51) దంచికొట్టడంతో.. ఆదివారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో 20 రన్స్ తేడాతో చెన్నై సూపర్‌కింగ్స్‌పై నెగ్గింది. టాస్ గెలిచిన ఢిల్లీ 20 ఓవర్లలో 191/5 స్కోరు చేసింది. గత మ్యాచ్‌లకు భిన్నంగా ఈసారి ఓపెనర్లు వార్నర్, పృథ్వీ షా (43) మెరుపు ఆరంభాన్నిచారు. తొలి రెండు ఓవర్లు నెమ్మదిగా ఆడినా... తర్వాత ఇద్దరు పోటీపడి బౌండ్రీలు, సిక్సర్లు బాదారు. ముఖ్యంగా వార్నర్ 4, 6, 6, 4, 4, 4 దంచాడు. ఆరో ఓవర్‌లో షా 4 ఫోర్లు బాదడంతో పవర్‌ప్లేలో డీసీ 62/0 స్కోరు చేసింది. తర్వాతి ఓవర్లలో 4, 6తో చెలరేగిన వార్నర్ 32 బాల్స్‌లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. కానీ 10వ ఓవర్‌లో ముస్తాఫిజుర్ (1/47) దెబ్బకు ఔట్ కావడంతో తొలి వికెట్‌కు 93 రన్స్ పార్ట్‌నర్‌షిప్ ముగిసింది. ఆరు బాల్స్ తర్వాత పృథ్వీ కూడా వెనుదిరగడంతో స్కోరు 103/2గా మారింది. ఈ టైమ్‌లో రిషబ్ ధనాధన్ బ్యాటింగ్ చేసినా, పతిరణ (3/31) డబుల్ స్ట్రోక్ ఇచ్చాడు. 15వ ఓవర్‌లో 3 బాల్స్ తేడాలో మార్ష్ (18), స్టబ్స్ (0)ను పెవిలియన్‌కు చేర్చడంతో డీసీ 134/4తో నిలిచింది. రెండో వైపు పంత్ 4, 6, 6, 4, 4తో రెచ్చిపోయాడు. ఈ క్రమంలో 31 బాల్స్‌లోనే ఫిఫ్టీ కొట్టాడు. కానీ ఐదో వికెట్‌కు 44 రన్స్ జోడించి పతిరణకు వికెట్ ఇచ్చాడు. చివర్లో అభిషేక్ పోరెల్ (9*), అక్షర్ పటేల్ (7*) ఫర్వాలేదనిపించడంతో చివరి 10 ఓవర్లలో 96 రన్స్ వచ్చాయి. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 171/6 స్కోరు చేసింది. అజింక్యా రహానె (45) టాప్ స్కోరర్. డారిల్ మిచెల్ (34) రాణించాడు. ఇన్నింగ్స్ ఆరో బాల్‌కే రుతురాజ్ (1), మూడో ఓవర్‌లో రచిన్ రవీంద్ర (2) ఔట్‌కావడంతో సీఎస్కే 7/2 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ దశలో రహానె, మిచెల్ ఇన్నింగ్స్‌ను ఆదుకునే బాధ్యత తీసుకున్నారు. పవర్‌ప్లేలో 32/2 స్కోరు చేసిన చెన్నైని క్రమంగా గట్టెక్కించారు. వీలైనప్పుడల్లా బౌండ్రీలు సిక్స్‌లు కొట్టి మూడో వికెట్‌కు 68 (45 బాల్స్‌లో) రన్స్ జోడించి ఇన్నింగ్స్‌ను సుస్థిరం చేశారు. అయితే 11వ ఓవర్‌లో అక్షర్ పటేల్ (1/20).. మిచెల్‌ను ఔట్ చేశాడు. కానీ 14వ ఓవర్‌లో వరుస బాల్స్‌లో రహానె, సమీర్ రిజ్వి (0)ని, 17వ ఓవర్‌లో శివమ్ దూబె (18)ను ఔట్ చేసిన ముకేశ్ (3/21) మ్యాచ్‌ను ఢిల్లీ వైపు తీసుకెళ్లాడు. దీంతో సీఎస్కే 120/6తో ఎదురీత మొదలుపెట్టింది. ఈ టైమ్‌లో జడేజా (21*), ధోనీ (16 బాల్స్‌లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 37*) బ్యాట్లు ఝుళిపించారు. 17వ ఓవర్‌లో మూడు ఫోర్లతో 17, తర్వాతి ఓవర్‌లో మహీ 6తో 12 రన్స్ వచ్చాయి. చివరి 12 బాల్స్‌లో 46 రన్స్ అవసరం కాగా, ధోనీ 4, 6, 4, 6తో ఓటమి అంతరాన్ని తగ్గించాడు. ఖలీల్‌అహ్మద్(2/21)కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

## సన్‌రైజర్స్‌కు గుజరాత్ చెక్




బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా ఫెయిలవ్వడంతో.. ఆదివారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్ చేతిలో ఓడింది. టాస్ నెగ్గిన హైదరాబాద్ 20 ఓవర్లలో 162/8 స్కోరు చేసింది. అభిషేక్ శర్మ (29), అబ్దుల్ సమద్ (29) టాప్ స్కోరర్లు. మోహిత్ శర్మ (3/25) దెబ్బకు సన్ ఇన్నింగ్స్ కుదేలైంది. తర్వాత గుజరాత్ 19.1 ఓవర్లలో 168/3 స్కోరు చేసి గెలిచింది. డేవిడ్ మిల్లర్ (27 బాల్స్‌లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 44*), సాయి సుదర్శన్ (36 బాల్స్‌లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 45), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (28 బాల్స్‌లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 36) చెలరేగారు. తొలి వికెట్‌కు 36 రన్స్ జత చేసి సాహా (25) ఔటైనా, గిల్, సాయి సుదర్శన్ నిలకడగా ఆడారు. వీలైనప్పుడల్లా బౌండ్రీలు బాదుతూ రన్‌రేట్‌ను కాపాడారు. ఈ క్రమంలో రెండో వికెట్‌కు 38 రన్స్ జత చేసి గిల్ వెనుదిరిగాడు. 74/2 స్కోరు వద్ద వచ్చిన మిల్లర్ మెరుపులు మెరిపించాడు. సాయి కూడా పోటీ పడి రన్స్ చేయడంతో థర్డ్ వికెట్‌కు 64 రన్స్ జతయ్యాయి. 36 బాల్స్‌లో ఫిఫ్టీ చేసిన సాయి 17వ ఓవర్‌లో ఔటైనా, విజయ్ శంకర్ (14*) అండతో మిల్లర్ రెచ్చిపోయాడు. ఈ ఇద్దరు నాలుగో వికెట్‌కు 30 రన్స్ జోడించారు. మోహిత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. హైదరాబాద్ బ్యాటర్లకు మంచి ఆరంభాలు లభించినా భారీ స్కోర్లుగా మల్చలేకపోయారు. దీనికి తోడు మ్యాచ్ మధ్యలో అఫ్గాన్ స్పిన్ జోడీ నూర్ అహ్మద్ (1/32), రషీద్ ఖాన్ (1/33) రెండు కీలక వికెట్లు తీసి భారీ స్కోరును అడ్డుకున్నారు. 4వ ఓవర్‌లోనే మయాంక్ (16) ఔటైనా, హెడ్ (19) దూకుడుతో పవర్‌ప్లేలో సన్‌రైజర్స్ 56/1 స్కోరు చేసింది. కానీ 7వ ఓవర్‌లో నూర్ దెబ్బకు హెడ్ ఔట్‌కావడం హైదరాబాద్ ఇన్నింగ్స్‌పై ప్రభావం చూపింది. ఈ దశలో అభిషేక్ శర్మ 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో బ్యాట్ ఝుళిపించినా ఎక్కువసేపు నిలవలేదు. 10వ ఓవర్‌లో మోహిత్‌కు వికెట్ ఇచ్చుకున్నాడు. 74/3తో కష్టాల్లో పడిన రైజర్స్‌ను మార్‌క్రమ్ (17), క్లాసెన్ (24) గట్టెక్కించే ప్రయత్నం చేశారు. లాంగాన్, మిడాఫ్‌లో రెండు భారీ సిక్స్‌లు కొట్టిన క్లాసెన్‌ను14వ ఓవర్‌లో రషీద్ పెవిలియన్‌కు పంపాడు. తర్వాతి ఓవర్‌లో మార్‌క్రమ్ కొట్టిన వైడ్ షాట్‌ను డీప్‌లో రషీద్ అందుకోవడంతో మ్యాచ్ ఒక్కసారిగా టర్న్ అయ్యింది. నాలుగో వికెట్‌కు 34 రన్స్ భాగస్వామ్యం ముగిసింది. ఇక 115/4 వద్ద వచ్చిన షాబాజ్ అహ్మద్ (22), అబ్దుల్ సమద్ ఆరో వికెట్‌కు 28 బాల్స్‌లోనే 45 రన్స్ జోడించారు. కానీ లాస్ట్ ఓవర్‌లో మోహిత్ .. షాబాజ్, సుందర్ (0) వికెట్లు తీశాడు. చివరి బాల్‌కు సమద్ రనౌటయ్యాడు. ఈ ఓవర్‌లో మూడే రన్స్ రావడంతో హైదరాబాద్ చిన్న టార్గెట్‌నే నిర్దేశించింది.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# బెంగాల్‌లో తుఫాన్ విధ్వంసం

## పలు ఇళ్లు ధ్వంసం, నేలకూలిన చెట్లు.. 5 మంది మృతి

పశ్చిమ బెంగాల్‌లోని జల్పైగురిలో తుఫాన్ పెను విధ్వంసం సృష్టించింది. ఈ ప్రాంతంలో తుఫాను, వర్షం, వడగళ్ల వాన కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. భారీ సంఖ్యలో చెట్లు నేలకూలాయి. చాలా ఇళ్లు దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో 5 మంది మృతి చెందినట్లు జల్పైగురి ఎస్పీ ధృవీకరించారు. 100 మందికి పైగా గాయపడ్డారు. తుఫాన్ కలిగించిన నష్టంపై అధికారులు అంచనా వేస్తున్నారు. తుఫాను కారణంగా సంభవించిన మరణాలపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంతాపం వ్యక్తం చేశారు. మృతులకు నష్టపరిహారం ప్రకటించారు. అంతేకాకుండా బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. తుపాను ధాటికి చాలా ఇళ్లు కూలిపోయాయి. సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. ఆదివారం నాడు జల్పైగురిలో తుఫాను భారీ విధ్వంసం సృష్టించింది. బలమైన గాలులకు చెట్లు నేలకూలాయి. ఇళ్లకు కూడా భారీ నష్టం వాటిల్లింది. వడగళ్ల వాన కారణంగా పంటలు ధ్వంసమయ్యాయి. విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తుఫాను తగ్గుముఖం పట్టిన తర్వాత ఎక్కడ చూసినా తుఫాన్ సృష్టించిన విధ్వంసం కనిపిస్తోంది. ప్రజలు తమ ఇళ్ల నుండి విరిగిన వస్తువులను సేకరించడం ప్రారంభించారు. స్థానికుల సాయంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తుపాను కారణంగా 5 మంది మృతి చెందినట్లు జల్పైగురి ఎస్పీ ధృవీకరించారు. ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులు జల్పాయిగురి-మైనాగురి ప్రాంతాల్లో భారీ విధ్వంసాన్ని సృష్టించాయి. ప్రాణనష్టం జరిగింది. పలువురు గాయపడ్డారు, ఇల్లు దెబ్బతిన్నాయి. చెట్లు , విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.



సీఎం మమతా బెనర్జీ విచారం వ్యక్తం తుపాను కారణంగా సంభవించిన విధ్వంసంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విచారం వ్యక్తం చేశారు. మృతుల బంధువులకు, క్షతగాత్రులకు తగిన పరిహారం అందజేస్తామని చెప్పారు. మృతుల బంధువులకు, క్షతగాత్రులకు ఎంసీసీ నిబంధనల ప్రకారం జిల్లా యంత్రాంగం పరిహారం అందజేస్తుందని తెలిపారు. తుఫాను తర్వాత 170 మందికి పైగా రోగులు ఆసుపత్రికి ఎమర్జెన్సీకి వచ్చారని జల్పైగురి ప్రభుత్వ వైద్య కళాశాల మెడికల్ సూపరింటెండెంట్ మరియు వైస్ ప్రిన్సిపాల్ చెప్పారు. వీరిలో 49 మంది రోగుల పరిస్థితి విషమంగా ఉంది. అందరూ చికిత్స పొందుతున్నారు.



## ఆందోళనకు గురిచేస్తున్న బెంగళూరు నీటి కష్టాలు

బెంగళూరు నీటి కష్టాలు దేశంలోని ఇతర నగరాలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. దేశంలో 2030నాటికి 40 శాతం ప్రజలకు సరైన తాగునీటి వసతి ఉండదని నీతి ఆయోగ్ ఇప్పటికే స్పష్టం చేసింది. 2050 కల్లా ఢిల్లీ, ముంబై, లక్నో, హైదరాబాద్, విశాఖపట్నంతో సహా డజనుకుపైగా నగరాల్లోని ప్రజలు దాహంతో అల్లాడక తప్పదని వరల్డ్ వైడ్ ఫండ్ నివేదిక హెచ్చరిస్తోంది. ఇండో-గంగా బేసిన్‌లో ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటిపోయాయని యూఎన్ సైతం పేర్కొంది.



## రోహిత్ శర్మ ఔట్.. సంబరాలు చేసుకున్న వ్యక్తిని కొట్టి చంపిన అభిమానులు

గత బుధవారం ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ చాలా ఉత్కంఠభరితంగా జరిగింది. ఇందులో హైదరాబాద్ IPL చరిత్రలో 3 వికెట్లకు 277 పరుగుల అత్యధిక స్కోరు చేసి, ముంబైపై విజయం సాధించింది. ఈ మ్యాచ్ సందర్భంగా మహారాష్ట్రలో ఇద్దరు అభిమానుల మధ్య జరిగిన గొడవ కాస్తా పెరిగి పెరిగి చంపుకునే స్థాయికి చేరింది. అయితే మ్యాచ్ జరిగిన క్రమంలో 63 ఏళ్ల బండోపంత్ టిబిలే, 50 ఏళ్ల బల్వంత్ ఝుంజ్‌గే ఓ స్నేహితుని ఇంట్లో ఈ మ్యాచ్‌ని చుశారు. ఆ క్రమంలోనే మ్యాచ్ సమయంలో ముంబై ఆటగాడు రోహిత్ శర్మ ఔట్ అయ్యాడు. అప్పుడు వెంటనే సీఎస్ కే అభిమాని టిబిల్ రోహిత్ అవుట్ అయ్యాడని వ్యాఖ్యలు చేస్తూ సంబరాలు చేసుకున్నాడు. దీంతో అది తట్టుకోలేని ఝుంజ్‌గే అతనిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆ నేపథ్యంలో వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ తర్వాత ఝుంజ్‌గే అక్కడి నుంచి వెళ్లి తన బంధువు సాగర్‌ని కూడా తీసుకొచ్చి టిబిల్‌ను తీవ్రంగా కొట్టాడు. దీంతో గాయపడిన టిబిల్‌ను అతని కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. కానీ శనివారం టిబిల్ చికిత్స పొందుతున్న క్రమంలోనే మృత్యువాత చెందాడు. ఈ ఘటన నేపథ్యంలో నిందితులిద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేశామని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో చోటుచేసుకుంది.

## మళ్లీ పాక్ కెప్టెన్‌గా బాబర్



పాకిస్థాన్ వన్డే, టీ20 జట్లకు కెప్టెన్‌గా స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ తిరిగి నియమితుడయ్యాడు. టీ20 ప్రపంచకప్‌కు రెండు నెలల ముందు బాబర్ చేతికి మళ్లీ పగ్గాలు అప్పగిస్తూ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిర్ణయం తీసుకుంది. గత ఏడాది వన్డే ప్రపంచకప్ వైఫల్యం అనంతరం బాబర్‌ను తప్పించి పేసర్ షహీన్ షా అఫ్రిదికి పగ్గాలు అప్పగించింది పీసీబీ. కానీ అతడి నాయకత్వంలో జట్టు వరుస ఓటములు చవి చూసింది. చివరగా జనవరిలో జరిగిన టీ20 సిరీస్‌లో న్యూజిలాండ్ చేతిలో 1-4తో పాక్ చిత్తయింది. దీంతో బాబర్‌ను తిరిగి కెప్టెన్‌గా నియమిస్తూ పీసీబీ సెలెక్షన్ కమిటీ ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకుంది.

## ఏప్రిల్ 5 నుంచి ఆహాలో అనన్య నాగళ్ల తంత్ర

తెలుగమ్మాయి అనన్య నాగళ్ల నటించిన లేటెస్ట్ సినిమా తంత్ర. శ్రీనివాస్ గోపిశెట్టి తెరకెక్కించిన హర్రర్ థ్రిల్లర్ లో ధనుష్ రఘుముద్రి, సలోని, టెంపర్ వంశీ, మీసాల లక్ష్మణ్ ముఖ్య పాత్రలు పోషించారు. టీజర్స్, ట్రైలర్ తోనే భయపెట్టించిన తంత్ర మార్చి 15న థియేటర్లలో రిలీజైంది. పాజిటివ్ టాక్ తో బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లే రాబట్టింది. సినిమాలో హారర్ అండ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ బాగున్నాయని రివ్యూలు వచ్చాయి. థియేటర్లలో ప్రేక్షకులను భయపెట్టిన తంత్ర అప్పుడే డిజిటల్ స్ట్రీమింగ్ కు సిద్ధమైంది. ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్ ఫామ్ ఆహా ఈ మూవీ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో థియేటర్లలో రిలీజైన 20 రోజులకే తంత్ర సినిమా ఓటీటీలోకి రానుంది. ఏప్రిల్ 5 నుంచి ఈ సినిమాను స్ట్రీమింగ్ కు తీసుకురానున్నారు. తాజాగా ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది ఆహా. 'తంత్రం మంత్రం కుతంత్రం', 'ఆహా అందిస్తోన్న మరో హారర్ చిత్రం' అంటూ తంత్రం ఓటీటీ రిలీజ్ డేట్ తో పాటు పోస్టర్ ను షేర్ చేసింది ఆహా.






## ఎన్నికల సర్వేల్లో రిషి సునాక్‌కు షాక్



బ్రిటన్‌లో ఇప్పటికిప్పుడు సాధారణ ఎన్నికలు జరిగితే భారత సంతతికి చెందిన రిషి సునాక్‌తోపాటు ఆయన కేబినెట్‌లోని సగానికి పైగా మంత్రులకు పరాజయం తప్పదని ముందస్తు సర్వేలో తేలింది. అధికార కన్జర్వేటివ్ పార్టీకి 100 పార్లమెంట్ స్థానాలు కూడా దక్కడం గగనమేనని, అదే సమయంలో ప్రతిపక్ష లేబర్ పార్టీ 468 సీట్లు గెలుచుకుని, 286 సీట్ల మెజారిటీ సాధిస్తుందని కూడా అంచనా వేసింది. బెస్ట్ ఫర్ బ్రిటన్ తరఫున సర్వేషన్ సంస్థ 15,029 మందితో తాజాగా సర్వే జరిపింది. ఇందులో పాల్గొన్న వారిలో 45 శాతం మంది ప్రతిపక్ష లేబర్ పార్టీకే ఓటేశారు.పాయింట్ల వారీగా చూస్తే అధికార కన్జర్వేటివ్ పార్టీ కంటే లేబర్ పార్టీ 19 పాయింట్లు ముందంజలో ఉంది. గత ఏడాది డిసెంబర్‌లో చేపట్టిన పోలింగ్‌తో పోలిస్తే ఇది మూడు పాయింట్లు ఎక్కువ. కన్జర్వేటివ్ పార్టీ 100 లోపే సీట్లు గెలుచుకోవడం, అంటే 250 ఎంపీ స్థానాలను కోల్పోవడం ఇటీవలి కాలంలో ఇదే మొదటిసారవుతుందని నిర్వాహకులు విశ్లేషిస్తున్నారు. సొంత సీటు రిచ్‌మండ్ అండ్ నార్త్‌అల్లెర్టన్‌లో ప్రధాని రిషి సునాక్‌కు లేబర్ పార్టీ కంటే 2.4 శాతం మాత్రమే ఎక్కువ ఓట్లు పోలయ్యాయి.

## మనసులో మాట బయట పెట్టిన మృణాల్

త్వరలోనే ఫ్యామిలీ స్టార్ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆసక్తికర కామెంట్స్ చేసింది. రిలేషన్ షిప్ గురించి మాట్లాడుతూ.. సినిమాలో నా రోల్ ను నేను ప్రేమిస్తా.. నా వర్క్‌ను గుర్తిస్తే నేను పడ్డ కష్టమంతా మర్చిపోతాను అని తెలిపింది. ఒకవేళ ఏదైనా నెగిటివ్ వస్తే నా తప్పు ఏమైనా ఉందా.? అని ఆలోచిస్తా.. ఇక రియల్ లైఫ్ ప్రేమ గురించి చెప్పాలంటే.. ఒకసారి ప్రేమలో పడిన తర్వాత..ఆ ప్రేమను మరింత పెంచేందుకు ప్రయత్నించాలి. ఇంకా మిగిలిన వాటి గురించి ఆలోచించకూడదు అని తెలిపింది. నమ్మకం, అనుబంధం అనేవి రెండు వైపులా ఉండాలి. అప్పుడే ఆ రిలేషన్ షిప్ వర్కౌట్ అవుతుంది. నేను ఏ రిలేషన్ షిప్ లోనూ లేను. నాకు ప్రేమలో పడాలని ఉంది. ఇరవై లోనే పెళ్లి చేసుకొని.. పిల్లలను కనాలనిపిస్తుంది. వాళ్ళను తీసుకొని డిన్నర్ కు వెళ్లాలని ఉంది. సెలబ్రెటీ అయితే ఫ్యామిలీని చాలా మిస్ అవుతాం.. ఎక్కడికి ఫ్రీగా వెళ్లలేం.. కనీసం ఒక గుడికి కూడా వెళ్లలేం అని చెప్పుకొచ్చింది మృణాల్.



## టోల్‌ప్లాజాల పన్నుల ధరలు పెరిగాయి

హైదరాబాద్-విజయవాడ హైవేపై పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు టోల్‌ప్లాజాల వద్ద పెరిగిన పన్ను రుసుములు అమల్లోకి వచ్చాయి. కార్లు, జీపులు, వ్యాన్‌లకు ఒక వైపుకు ₹5, రానూపోనూ కలిపి ₹10, భారీ రవాణా వాహనాలకు ₹35, ₹50 చొప్పున పెంచారు. 2025 మార్చి 31 వరకు పెరిగిన ధరలు అమల్లో ఉంటాయి. పంతంగి వద్ద కారు ఒకవైపు ధర రూ.95, రానూపోనూ రూ.145, కొర్లపహాడ్ వద్ద రూ.130, రూ.195, చిల్లకల్లు వద్ద రూ.110, రూ.160గా ఉన్నాయి.



## కాంగ్రెస్‌కు కీలక నేత రాజీనామా

లోక్‌సభ ఎన్నికలకు ముందు బీహార్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అసిత్ నాథ్ తివారీ కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. ప్రాథమిక సభ్యత్వంతో పాటు అధికార ప్రతినిధి పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఆయన ప్రకటించారు. తన రాజీనామా లేఖను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అఖిలేష్ ప్రసాద్ సింగ్‌కు పంపించారు. రాజీనామాకు కారణం పూర్తిగా వ్యక్తిగతమని ఆయన లేఖలే పేర్కొన్నారు.



## కొమురవెల్లిలో పెరిగిన భక్తుల సందడి

కొమురవెల్లి పుణ్యక్షేత్రం నిన్న భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణమంతా మల్లన్న నామస్మరణతో మార్మోగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11వ ఆదివారానికి చుట్టుపక్కల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కోనేరులో స్నానం చేసి స్వామివారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు ఒడిబియ్యం పోసి, గంగిరేగు చెట్టువద్ద పట్నాలు వేసి ముడుపులు కట్టారు. అలాగే కొండపైన ఉన్న రేణుక ఎల్లమ్మకు బోనాలు సమర్పించుకున్నారు.